క్లుప్తంగా

సృజనాత్మకత పెంపుదలకు దోహదం



చేబ్రోలు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలని, కొత్త ఆవిష్కరణల రూపకల్పనకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉపయోగపడుతాయని జిల్లా సైన్ అధికారి షేక్ గౌసుల్ మీరా చెప్పారు. చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన రీజియన్ లెవల్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల వర్క్‌షాపు గురువారం ముగిసింది. ఏడు జిల్లాల ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు వివిధ అంశాలపై రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నారాకోడూరు హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, యునిసెస్ ప్రతినిధి సుదర్శన్, రిసోర్స్ పర్సన్‌లు వెంకటేష్, హేమా, ఏలూరు, కృష్ణ, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు



పొన్నూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి హెచ్చరించారు. విజిలెన్స్, డివిజన్ పరిధిలోని డీఈఈలు, ఏఈలు 39 బృందాలుగా ఏర్పడి పట్టణంలోని గృహాలు, వ్యాపార సంస్థలలో గురువారం విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. 123 కేసులు నమోదు చేసి రూ.5.82 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఈఈ మూర్తి తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పొన్నూరు డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ కె. వెంకయ్య, డిపిఈ డీఈ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడం అందరి బాధ్యత



పెదకాకాని: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అందరి బాధ్యతని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. కేరళ వరద బాధితుల సహాయార్థం గురువారం నంబూరు, తక్కెళ్లపాడు, అగతవరప్పాడు సచివాలయాల్లో విరాళాలు సేకరించారు. నన్నపనేని శివాజీ మాట్లాడుతూ బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మొత్తం రూ.29,100 సీపీఎం జిల్లా సెంటర్ ద్వారా బాధితులకు పంపించామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ తెలిపారు.

బడ్డీ కొట్టులో చోరీ

గుంటూరు ఈస్ట్: బడ్డీ కొట్టులో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి మిర్చి యార్డు రోడ్డులో బడ్డీ నడుపుకుంటున్నాడు. గురువారం కొట్టు తెరిచేందుకు వెళ్లగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల పరిశీలించగా రూ. 35వేలతో పాటు రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంటిలో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయినగర్‌లో నివసించే రామచంద్ర సహాని గదిలో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తలుపు బలవంతంగా తెరిచి సెల్‌ఫోను, రూ. 200 ఎత్తుకు పోయాడు. ఈ మేరకు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం ఇప్పిస్తానని మోసం

గుంటూరు ఈస్ట్: స్థలం ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఅగ్రహారంలో నివాసం ఉండే ఉడతా శ్రీనివాసరావుకు కృష్ణారెడ్డి, శైలజ పరిచయమయ్యారు. గుంటూరు నగరంలో ఓ స్థలం చూపించి తక్కువ రేటుకు ఇప్పిస్తామని నమ్మబలికారు. విడతల వారీగా రూ. 16 లక్షలు తీసుకున్నారు. స్థలం ఇప్పించకపోవడంతో శ్రీనివాసరావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులమని బెదిరించి డబ్బులు వసూలు ?

గుంటూరు ఈస్ట్: పోలీసులమంటూ దుస్తుల షాపు యజమానిని ఇద్దరు బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం. సేకరించిన సమాచారం మేరకు.. కొత్తపేటలోని ఓ బట్టల షాపునకు గురువారం ఇద్దరు వ్యక్తులు పోలీసులమంటూ వెళ్లారు. పన్ను ఎగవేస్తున్నావంటూ, నకిలీ బ్రాండ్ దుస్తులు విక్రయిస్తున్నావంటూ యజమానిని బెదిరించి రూ. 1.60 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

మెప్మా సిబ్బంది దా'రుణాలు'

ప్రభుత్వ ఉద్యోగుల భార్యల పేరుతో రుణాలు

- బంధువుల ఆధార్‌కార్డులతోనూ మోసం
- ఒక్కొక్కటిగా బయటపడుతున్న బాగోతాలు
- బ్యాంకు నోటీసులతో బెంబేలెత్తుతున్న బాధితులు
- ఉన్నతాధికారుల విచారణ కోరుతున్న వైనం



మెప్మా కార్యాలయం వద్ద ఫిర్యాదు చేస్తున్న బాధిత మహిళా సంఘాలు (ఫైల్)

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని మెప్మా (పేదరిక నిర్మూలనా సంస్థ) విభాగం అక్రమాలకు నిలయంగా మారింది. సభ్యులకు తెలియకుండా అధిక మొత్తంలో రుణాలు, బోగస్ గ్రూపులతో రుణాలు స్వాహా చేయడమే లక్ష్యంగా మెప్మా సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బోగస్ గ్రూపులతో, సభ్యులకు తెలియకుండా ఎక్కువ మొత్తంలో(లక్షల రూపాయలు) రుణాలు స్వాహా చేశారనే అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాల మహిళలు చేసిన ఫిర్యాదులతో మెప్మా సిబ్బంది పది రోజులుగా విచారణను ఎదుర్కొంటున్నారు. మెప్మా పీడీ వెంకటేశ్వర్లు ఆదేశాలతో పట్టణంలోని పలు వార్డులలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. ఇంటికి వచ్చిన బంధువులకు తెలియకుండా వారి ఆధార్ కార్డులతోనూ అక్రమంగా రుణాలు పొందిన ఘటనలు వెలుగుచూశాయి. తీగలాగితే డొంకంతా కదిలిందన్నట్లుగా సిబ్బంది చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

తాజాగా ప్రభుత్వ ఉద్యోగుల భార్యలు, గ్రూపులతో ఎలాంటి సంబంధంలేని మహిళల పేరుతో రుణాలు స్వాహా చేసిన అక్రమ నిర్వాకం బయట పడింది. బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేదని నోటీసులు రావడంతో బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. తమ పేరుతో ఏ పొదుపు సంఘం లేదని, తామెలాంటి రుణం పొందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవిగో.. నిదర్శనాలు

వ్యవసాయ శాఖ అధికారి భార్య పేరుతోనే!

పట్టణంలోని డఫ్‌పేటకు చెందిన అమల మహిళా పొదుపు సంఘంలో 4వ సభ్యురాలిగా ఉన్న బాపట్లకు చెందిన షేక్ ఆరిఫున్నీసా బేగం, భర్త షేక్. సిరాజుద్దీన్, వ్యవసాయ శాఖలో ప్రస్తుతం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. 2015లో ఈమె ఉన్న గ్రూపు రుణం బాకీ ఉన్నారని బ్యాంకు నుంచి నోటీసు అందింది. అయితే ఆ రుణం తాను తీసుకోలేదని, అసలు గ్రూపులోఉండాల్సిన అవసరమే తనకు లేదని ఆరిఫున్నీసా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే హైదరాబాద్‌లో ఉంటున్న ఆర్మీ ఉద్యోగి భార్య పేరుతోనూ రుణం స్వాహా చేసినట్టు తెలుస్తోంది. ఒకే గ్రూపులో ఒకే మహిళ పేరుతో రెండు రుణాలు పొందిన వింత ఘటనలూ వెలుగు చూస్తున్నాయి.

ఆ గ్రూపుతో సంబంధం లేదు

పొన్నూరులోని అమల మహిళా పొదుపు సంఘంతో మాకెలాంటి సంబంధం లేదు. ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి చెందిన నాకు బ్యాంకులలో పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రుణాలు పొందాల్సిన అవసరం లేదు. మోసపూరితంగా జరిగిన అక్రమ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నాను.

– షేక్ ఆరిఫున్నీసా బేగం, బాపట్ల

విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపడతాం



మహిళా పొదుపు సంఘాల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పట్టణంలో మెప్మా విభాగంలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. గ్రూపులతో సంబంధంలేకుండా నోటీసులు ఎవరైనా తీసుకుంటే తనను సంప్రదించాలి. పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, పీడీ, మెప్మా

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- 44 పాఠశాలల్లో ఎన్నికైన నూతన కమిటీలు
- ప్రమాణ స్వీకారం చేయించిన ప్రధానోపాధ్యాయులు
- 8.30 గంటల వరకూ తెరుచుకోని కొన్ని పాఠశాలలు



చినకొండ్రుపాడు జడ్పీహెచ్ఎస్ ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న హెచ్ఎం, గ్రామస్తులు



తిక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూలులో ఉదయం 8.40 గంటలకూ తెరుచుకోని హెచ్ఎం గది తలుపులు

ప్రత్తిపాడు: పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 44 పాఠశాలలకు గాను అన్ని పాఠశాలలకు కొత్త కమిటీలు ఏర్పాటయ్యాయి. ఎన్నికలకు ఈ నెల 1వ తేదీనే నోటిఫికేషన్ జారీ చేయడం, అదే రోజు ఓటు జాబితాలు నోటీసు బోర్డుల్లో ప్రదర్శించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిగింది. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రుల చొప్పున కమిటీ సభ్యుల ఎన్నిక జరగ్గా, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు ఎన్నికైన కమిటీ సభ్యులంతా కలిసి చేతులెత్తే విధానంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నూతన కమిటీతో సాయంత్రం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మొదటి పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికైన నూతన కమిటీలు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు..

ఇదిలా ఉంటే ఎన్నికల ప్రక్రియ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగాల్సి ఉంది. కానీ కీలకమైన ఎన్నికల నిర్వహణలోనూ ఉపాధ్యాయులు అలసత్వాన్ని ప్రదర్శించారు. ఉదయం ఏడు గంటలకే పాఠశాలలు తెరుచుకోవలసి ఉన్నప్పటికీ సగానికి పైగా పాఠశాలల్లో ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకూ కనీసం తాళాలు కూడా తియ్యలేదు. ఇక హెచ్ఎంలు అయితే తాపీగా ఉదయం తొమ్మిది గంటలకు పాఠశాలలకు చేరుకున్న దాఖలాలూ ఉన్నాయి. గొట్టిపాడు టీఎస్, ఎల్ఈ పెదగొట్టిపాడు, తిక్కిరెడ్డిపాలెం జెడ్పీ పాఠశాలల్లో ఉదయం 8.50 గంటల వరకూ కూడా హెచ్ఎంలు హాజరుకాలేదు. అనంతరం బడికి వచ్చిన వారు నింపాదిగా ఎన్నికల ప్రక్రియను మొదలుపెట్టారు.

కాకుమానులో...

కాకుమాను: మండలంలోని అన్ని పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ కేవీ కెనడీ తెలిపారు. మండలంలో మెత్తం 33 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా అన్ని పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగినట్లు ఆయన తెలిపారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఓటింగ్‌తో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా పాఠశాల హెచ్ఎంలు, కో–ఆప్టెడ్ సభ్యులుగా ఆయా గ్రామానికి చెందిన దాతలు, విద్యావేత్తలను ఎంపిక చేసినట్లు ఎంఈఓ కెనడీ తెలిపారు.

పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికలు



మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్ఎం ఆనందరావు, ఎస్ఎంసీ చైర్మన్ చక్రవర్తి

పెదకాకాని: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పెదకాకాని మండలంలో గురువారం ఏడు జిల్లా పరిషత్ పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 37 ప్రాథమిక పాఠశాలల్లో విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలను పురస్కరించుకుని పలు పాఠశాలల వద్ద ఎటువంటి వివాదాలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పెదకాకాని లూథర్‌గిరి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా బండ్లమూడి చక్రవర్తి ఎన్నికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కొల్లిపర ఆనందరావు తెలిపారు. అనంతరం గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో 'క్విట్ ఇండియా ఉద్యమం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీఎస్ఎల్ఈ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కొల్లిపర ఆనందరావు, ఎస్ఎంసీ చైర్మన్ బండ్లమూడి చక్రవర్తి హాజరయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేశభక్తి గేయాలు ఆలపిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్ ప్రభావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొన్నూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ(పాఠశాల యాజమాన్య కమిటీలు) ఏర్పాటుకు గురువారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని మొత్తం 88 ప్రభుత్వ పాఠశాలల్లో 86 పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలను ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్‌సీ ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూల్, ఎంవీకే హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో పలు కారణాలతో ఎన్నికలు జరగలేదని తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ప్రక్రియలో ముందుగా తల్లిదండ్రుల కమిటీ సభ్యుల ఎన్నిక నిర్వహించారు. తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహించి అనంతరం సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. సాయంత్రం పాఠశాల నూతన తల్లిదండ్రుల కమిటీ మొదటి సమావేశం నిర్వహించి విధి విధానాలను ప్రధానోపాధ్యాయులు నూతన కమిటీలకు తెలిపారు. పలు పాఠశాలల్లో ఎంఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొని నూతన కమిటీలకు అభినందనలు తెలిపి పలు సూచనలు చేశారు.

తనిఖీలు చెయ్యకున్నా.. చేసినట్లుగా..

- తనిఖీలకు వస్తున్నట్లు రాసి సంతకం చేసివ్వండి
- 'సాక్షి' కథనం నేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్లకు సీఎస్ డీటీ హుకుం!
- సంతకాలు చేసి ఇచ్చిన ఆపరేటర్లు



సంతకాల కోసం ప్రత్తిపాడులో ఒక్కచోట సమావేశమైన ఎండీయూ ఆపరేటర్లు

ప్రత్తిపాడు: 'సాక్షి' కథనంతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఉలిక్కిపడ్డారు. దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఎండీయూ ఆపరేటర్లుకు హుకుం జారీ చేసి తమకు అనుకూలంగా లేఖలు రాయించుకున్నారు. ప్రత్తిపాడు మండలంలో రేషన్ పంపిణీని సీఎస్ డీటీ తనిఖీలు చేయడం లేదని, ఫలితంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయంటూ గురువారం 'తనిఖీలెక్కడ!' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎస్ డీటీ పద్మజ ఎండీయూ ఆపరేటర్లకు ఫోన్ చేసినట్లు వినికిడి. నేను ప్రతి రోజూ తనిఖీలకు వస్తున్నట్లు లెటర్ రాసి వాటిపై మండలంలోని ఎండీయూ ఆపరేటర్లంతా సంతకాలు చేసి ఇవ్వాలని ఆదేశించినట్లు భోగట్టా. దీంతో కొందరు ఆపరేటర్లు ప్రత్తిపాడులో ఓ చోట సమావేశమై సీఎస్ డీటీ చెప్పింది చెప్పినట్లుగా లేఖరాసి, వాటిపై సంతకాలు చేసి ఇచ్చారు. అదే లేఖను జిల్లా ఉన్నతాధికారులకు పంపి చెయ్యని తనిఖీలను చేసినట్లుగా చెప్పుకొనే ప్రయత్నం పౌరసరఫరాల అధికారులు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చలపతిలో ముగిసిన శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న రాహుల్ సహదేవ్

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతల దృష్ట్యా విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలని సాప్ యూనివర్సిటీ అలియెన్స్ ఇండియా డైరెక్టర్ రాహుల్ సహదేవ్ తెలిపారు. రెండు రోజులుగా నగర శివారుల్లోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఉపాధి విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న సాప్ డిజైన్ థింకింగ్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రాహుల్ సహదేవ్ ముఖ్య అతిథిగా పాల్గొని డిజైన్ థింకింగ్ సూత్రాలపై ఆధారపడిన సృజనాత్మక సమస్య పరిష్కారమార్గాలను వివరించారు. విద్యార్థులతో పలు నమూనాలను ప్రత్యక్షంగా చేయించి వారికి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ శిబిరాలవల్ల విద్యార్థులలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన కల్పించండి

స్టేట్ టీబీ ఆఫీసర్ డాక్టర్ రమేష్



నడింపాలెం సబ్‌సెంటరులో టీబీ వ్యాక్సిన్‌పై ఏఎన్ఎంలను ప్రశ్నిస్తున్న డాక్టర్ రమేష్

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని స్టేట్ టీబీ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని నడింపాలెం–1, 2 సచివాలయాల పరిధిలోని సబ్‌సెంటర్లులో గురువారం ఎస్‌టీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఇప్పటివరకు ఎంత మందికి అడల్ట్ టీబీ వ్యాక్సిన్ అందించారు? మొత్తం ఎంత మంది అర్హులు ఉన్నారు? అన్న వివరాలను ఏఎన్ఎం ఆంథోనిను అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లలకు బీసీజీ వ్యాక్సిన్ వేయడం వలన వారిలో టీబీ కేసులు నమోదు కావడం లేదని ఎస్‌టీఓ రమేష్‌కు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ పెద్దవారికి కూడా వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ధూమపానం చేసేవారు, అరవై ఏళ్లు పైబడిన వృద్ధులు వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వెంట ఆశా కార్యకర్తలు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

జిల్లా మలేరియా కార్యాలయం సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్



తొట్టిలో నిల్వ ఉన్న నీటిని పడబోయిస్తున్న సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్

ప్రత్తిపాడు: దోమల నివారణకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా కార్యాలయం సూపర్‌వైజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం, కొండజాగర్లమూడి గ్రామాల్లో గురువారం దోమల నివారణకు, లార్వా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. నివాస ప్రాంతాలు, ఆవాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటింటికీ తిరిగి ఇళ్లలోని గాబులు, బక్కెట్లు, ఖాళీ కొబ్బరి బొండాల్లో ఉన్న నీటి నిల్వలను తొలగించారు. వెంట ఎంపీహెచ్ఈఓ చెల్లమ్మ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవాభివృద్ధికే వినియోగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జె. ఉషారాణి పేర్కొన్నారు. గుజ్జనగుండ్లలోని కళాశాలలో గురువారం కోల్‌కత్తాకు చెందిన ముందడుగు విద్యా, వైజ్ఞానిక సంస్థ ఆధ్వర్యంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు కారణంగా జరిగిన విధ్వంసంపై విద్యార్థినులకు స్లైడ్స్, డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ అమెరికా దుశ్చర్య కారణంగా లక్షలాది ప్రజలు మరణించారన్నారు. ఈ యుద్ధం కలిగించిన వినాశన ఫలితాన్ని ఇప్పటికీ అక్కడి ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు. సైన్స్ ఫలాల్ని అభివృద్ధికి కాకుండా వినాశనానికి ఉపయోగిస్తే ఎంతటి దారుణమైన ఫలితాలు ఉంటాయో చెప్పేందుకు హిరోషిమా, నాగసాకి పట్టణాలే నిదర్శనమన్నారు. ముందడుగు సంస్థ కార్యదర్శి ఐకా బాలాజీ మాట్లాడుతూ కార్పొరేట్ వ్యాపార సంస్థల ప్రయోజనాల కోసం దేశాలపై దురాక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. యుద్ధాలని వ్యతిరేకించి, నివారించాల్సిన బాధ్యత యువతరంపై ఉందని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు రమాసుందరి, నిర్మల, లోకేష్, బీవీ ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష



ఆశా కార్యకర్తతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు: సీజనల్ వ్యాధులపై సమీక్షించేందుకు ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ దుర్గాప్రసాద్ ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో జ్వరాల నియంత్రణకు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ఆశా కార్యకర్త ప్రతి రోజూ ఎన్ని గృహాలు సందర్శిస్తారు? ఏమేమి రికార్డులు మెయింటెన్ చేస్తున్నారు? ప్రతి రోజూ హాజరు ఎక్కడ వేస్తారంటూ ఆశా కార్యకర్తలను ప్రశ్నించారు. దీంతో రావిపాటివారిపాలెం ఆశా కార్యకర్త ధనలక్ష్మి మాట్లాడుతూ తమకు ప్రభుత్వం ఏ రిజిస్టర్లూ ఇవ్వలేదని, మేము మా సొంత పుస్తకాల్లోనే వివరాలను రాసుకుంటామని ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాకుండా మేము ఎక్కడా హాజరు కూడా వేయాల్సిన పనిలేదని ఈ మేరకు డీఎంహెచ్ఓ ఉత్తర్వులు ఇచ్చారని చెప్పారు. దీంతో అసహనానికి గురైన ఎంపీడీఓ ఆగస్టు 15 నుంచి గ్రామ సచివాలయాల్లో ఒక పుస్తకం తీసుకుని ఆశా కార్యకర్తలు రిజిస్టర్ నిర్వహించాలన్నారు.

ప్రతిరోజూ ఖచ్చితంగా ఫీల్డ్‌కి వెళ్లాలి..

ఆశా కార్యకర్తలు కచ్చితంగా ప్రతి రోజూ ఫీల్డ్‌కి వెళ్లాలని, అపరిశుభ్రంగా పారిశుద్ధ్యం ఉంటే వెంటనే ఫొటోలు తీసి పంచాయతీ కార్యదర్శికి పంపాలన్నారు. మూడు రోజుల్లోగా పారిశుద్ధ్యం మెరుగు పరచకపోతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగ్గా ఉంటేనే సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వంటి జ్వరాలను నియంత్రించవచ్చని చెప్పారు. ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలపైన ఉందన్నారు. సమావేశంలో ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో మద్దిరాల జేఎన్‌వీ విద్యార్థినుల ప్రతిభ

- స్టెమ్ క్విజ్ పోటీల్లో ప్రథమస్థానంలో ఒకరు.. టాప్‌టెన్‌లో మరొకరు
- విజేతలను అభినందించిన అధ్యాపకులు



విజేతలైన విద్యార్థినులతో మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎన్ నరసింహారావు

చిలకలూరిపేటటౌన్: జాతీయస్థాయి క్విజ్‌పోటీల్లో పల్నాడు జిల్లా జేఎన్‌వీ విద్యార్థినులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా గురువారం విజేతలకు అభినందన సభను ఏర్పాటు చేశారు. విజ్ఞానజ్యోతి పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ విద్యాలయాల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు జాతీయస్థాయి క్విజ్ పోటీలను ఏర్పాటు చేస్తుంది. ఈ ఏడాది సమ్మర్ క్యాంపులో పోటీ ఫలితాలను గురువారం వెల్లడయ్యాయి. నవోదయ విద్యాసమితి, అపరాజిత ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో జేఎన్‌వీలకు చెందిన 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్టెమ్ (సైన్స్ టెక్నాలజీ ఇంజినీరింగ్, మ్యాథమ్యాటిక్స్)లో చిలకలూరిపేట మండలం మద్దిరాల గ్రామంలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థినులు సాయిగీతిక ప్రథమస్థానంలో నిలిచి రూ.12వేల విలువైన స్మార్ట్‌వాచ్, మెడల్‌ను సాధించింది. మరో విద్యార్థిని ఉమామహేశ్వరి అత్యుత్తమ ప్రతిభను కనపరిచి టాప్‌టెన్‌లో స్థానం సంపాదించుకుని మెడల్‌ను సాధించుకుంది. సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, మ్యాథ్స్, లైఫ్‌స్కిల్స్ క్విజ్‌పోటీల్లో ఆల్‌ఇండియాలో మెడల్స్‌తో పాటు పల్నాడు జేఎన్‌వీకు మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థినులకు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు, విద్యాలయ అధ్యాపకులు అభినందించారు.

అంక గణిత బోధనలో అబాకస్‌తో మెరుగైన ఫలితాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అబాకస్‌ను సంఖ్యా వ్యవస్థ, అంకగణిత బోధనలో ఉపయోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను అన్నారు. ప్రపంచ అబాకస్ దినోత్సవ సందర్భంగా గురువారం సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్ను మాట్లాడుతూ పూర్వ కాలంలో అబాకస్ ఒక ఆచరణాత్మక గణన సాధనమని తెలిపారు. తమ విద్యాసంస్థలో అబాకస్ ద్వారా గణితంలో అద్భుతమైన విజయాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు అబాకస్‌ను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు.